

# నయన ప్రియములు

సాంబ శివ
తడవర్తి

# అందమేది కానిదేది

అందమేది కానిదేది
కన్నులు అందం, కలువలు అందం
మగువలు అందం, మనసులు అందం
పదములు అందం, పలుకులు అందం
కులుకులు అందం, కోయిల అందం
స్వరములు అందం, సర్వం అందం
కాటుక అందం, జాబిలి అందం
నడకలు అందం, నాట్యం అందం
చూపులు అందం, కోపము అందం
చెక్కిళ్ళు అందం, చిన్నినవ్వు అందం
వాలుజడలు అందం, కాకపోయినా అందం

నయన ప్రియములన్నీ బుధ్బుద ప్రాయాలు
నే రాయలేక నా మదిలో పాడుకునే కావ్యాలు
ఇసుక తిన్నెలపై గీచిన అందమైన కలలు
వెన్నెల్లో విరిసిన విరజాజుల పరిమళాలు
నేడోరేపో, రేపోమాపో కాని ఏదోఒకనాడు

అందుకే మరి అందమేది, కానిదేది
ఆస్వాదించే కనులు ఉండాలేగాని

# ఎవరివో మరి

నీ గురించే ఆలోచిస్తూ
ఇల్లు విడచి మైళ్ళు నడచి
నా అనే అనే నన్ను నేను మరచి
నిలిచి ఉన్నాను ఇలా వెన్నెల మైదానంలో నీ కౌగిలికై చేతులు చాచి

ఎవరివో మరి
విశాల గగనపు నిశీధి మాటున దాగిన సొగసరివా
ఊహ వర్ణనాతీత నిశ్శబ్దపు వెన్నెల రాతిరివా
కవితావన పేటగాని మదిదోచిన మయూరివా
వేళకానివేళ నా నిద్దుర చెరిపిన  తీపి కలవా
నా మదిలో పరుగిడె దుడుకు జలపాతానివా
చుక్కలన్నీ పొడిచాక విరిసేటి సిరి కలువవా
చందమామకేసి చూసి పాడే చిన్ని కోయిలవా
ఎవరివైతేనేం ...
నామనసున నీవెపుడూ ... అపుడే పుట్టిన పసిదానివి...

# సంకురాతిరి

సంకురాతిరి చీకటేళ, మంచుతెరలు కమ్మినేళ
మువ్వలసడి చేయకుండ, వేగుచుక్క గానకుండ
వెన్నెలకే చిక్కకుండ, వొద్దన్నా వినకుండ
నన్ను జేరి నిద్దుర జెరిపి హద్దుగీత గీస్తావు న్యాయమా... ?
చనువుగ చెయ్యేసిన విదిలిస్తావు
ముద్దాడితె మగబుద్ధంటావు
మరు క్షణము ముగియకనే బిగికౌగిలితో బంధిస్తావు
నా ఒడిలోన వాలిపోయి యదచప్పుళ్ళను చదివేస్తావు
మృదుమధురధరామృతమిళిత ముద్దొకటి ముద్రిస్తావు
పెదవిపైపెదవుంచి నువ్విచ్చిన ఆ సప్తవర్ణాల షడ్రుచులకు " నేడే ఉగాది "
పెరటిపుంజు కూసేదాక తెలియలేదు తెల్లారిందని
మంచుతెరలు వీడిపోయె, మువ్వలసడి యాగిపోయె
వేగుచుక్క వెడలిపోయె, వెన్నెలమ్మ నిద్దురోయె
కోడెవయసు ఊహలన్ని,కవితలుగా జాలువారె...

# చెలి వాలుజడ

చెలి వాలుజడ మరి మరచుటెలా
అది యాడెనుగా నా యదలయలా

తను కడలి యలా
మదిలో మెదిలెనిలా
క్షణమున పరవశమిలా
అరివిరిసిన కమలములా
విరబూసిన కుసుమములా
మరుక్షణమున కనుమరుగేలా
అది నిజమేనా నా మదిలో కలా
మనసిచ్చానా తను కాదంటే ఎలా...
మరి మరచానా కల నిజమైతే ఎలా....

# మదిదోచిన వెన్నెల

కాటుకదిద్దిన కన్నులే మదిదోచిన వెన్నెలా
ఓరకంటి చూపులే చిటపట చిరు చినుకులా

చెలి చందనపు బుగ్గలే సింధూరపు మొగ్గలా
యా బుగ్గనంటిన సిగ్గులే మాపటేళ మల్లెలా

మరిమందార పెదవులే పున్నమిన తేనెలా
చిరునవ్వులో మధువులే జారే సిరివానలా

చెలి పైయదలో వంపులే ఊగే ఉయ్యాలలా
నడువొంపున సొంపులే యాడే జంపాలలా

వొడిసికట్టిన పవిటలే రంగుల హరివిల్లులా
సడిచేయని నడకలే పంచవన్నె చిలుకలా

నాట్యమాడే జడగంటలే నిశిరాతిరి నళినిలా
నా మనసునే దోచుకెళ్ళె అందాల రాక్షసిలా.

# కాటుక కన్నుల

అరమోడ్పు కనులతో నతివ చూచిన చాలు...
మేనెల్ల కలుగు నమృతపు వానజల్లు...
ఇక ఆ కనులకు కాటుక తోడైతే...
నా వెర్రి మనసుకో కలం తోడైంది…

# మేఘ పుష్పం

మందహాసం చిందెపెదవులు బుంగమూతిన అందమేగా
కన్నుగీటిన కన్నులే మరి ఉరిమిచూసిన అందమేగా
ఊసులాడిన చిన్నికోయిల మూగబోయిన అందమేగా
కులుకులొలికిన వగలమారి అలకపూనిన అందమేగా
నడుము నంటుతు నాట్యమాడే వాలుజడలు అందమేగా
వాలు చూపుతో వలలు వేసెడి కోన కన్నులు అందమేగా
అలసి సొలసిన లేలేత వదనము నిద్దురిడిన అందమేగా

మనసు దోచిన మేఘపుష్పము ఏమి చేసిన అందమేగా
~~~~~~~~~~~~~~~~~~~ నా మదికది ఆనందమేగా
~~~~~~~~~~~~~~~~~~~

# చిలిపి జలపాతమా

చెలి నడకకు హొయలొలికెడి ఝుంకీలు...
చిరు మందహసమేళవించి మది దోచెడి నయనాలు...
మకరంద కడలిన మదించిన మందార పుష్పాల వోలె పెదవులు...
ప్రకృతి యెదపై పరుగిడు చిలిపి జలపాతమును తలపెడి యా వోణీ...
ఇవి చాలవా నా మనసొక కవితాసంద్రమున కనుమరుగయ్యేందుకు…

# మారాజు

అంతఃపుర రాజతను......
అగ్రహారపు అవధానితను....
నాతల్లి కడపున మారాజుని నేను....

బోసిమొలలేగ ఉగ్గుపాలవేళ.....
బోసిమొలలేగ తులసితీర్ధవేళ.....

రుధిరగర్భము నందైనా.....
రుద్రభూమి నందైనా.....
ఏమున్నది ఎచటనైనా.....
విధియాడే పెర్రి నాటకంలో.....
మాంసపు ముద్దలేగా మనమంతా.....

# మేఘమా…

సంద్రమునందు పుట్టినవాన…
నా చెలి చెంతకు చేరేదాన…

తాపముతోన మరిగేదెవరు
జలనిధినొదిలి ఎగసేదెవరు
మేఘముగామరి మారేదెవరు
మేఘము యందు కరిగేదెవరు
గగనము యందు మిగిలేదెవరు
చిరుచినుకై భువనము చేరేదెవరు

చెలి మోముపై చిగురించేదెవరు
ఎవరు ఎవరెవరు అదియెవరు

# జోలపాట

పొద్దుగాల సద్దిబువ్వ, మాపటేళ గంజిచుక్క
ఈ మద్దెలో కుదిరితే ఒక్క ముంత కల్లు సాలు...
పల్లెలోన పుట్టినోడ్ని, పైరగాలి పీల్చినోడ్ని...
భూమితల్లిని నమ్మినోడ్ని, నాగలి పట్టి నడిచినోడ్ని...

బలిసినోళ్ళ చేతికింద, పిడికిడంత మనిసి నేను...
సూరీడు రాకముందే, స్వాతంత్ర్యం పొద్ది మాకు...
జోడెడ్ల బండి కట్టి, కౌలుభూమిన కష్టంజేసి...
పొత్తికడుపు మూటకట్టి, పైసలన్నీ భూమికిబోసి...
కలికాలం కక్ష కట్టి, వడగండ్ల వాన కురిసి...
నెత్తుటి చుక్కలు కష్టమంతా నల్లేరులో కలిసిపోతే...

సర్కారోళ్ళ జోలపాట భూస్వాముల ఇళ్ళలోన...
కౌలురైతు నిద్దరోయె కాటికాపరి పంచలోన...

# కవిసై కవిత్రై

కవిసై కవిత్రై నే రాసిన పదములే
పరికిణి కట్టిన తుంటరి పడుచులు
.
పడుచులు దిద్దిన రంగ వల్లులే
వీధిలో విరిసెను వింత పూవులై
.
పూవులు తొడిగిన ముగ్గు గొబ్బెమ్మలే
వాలగ వచ్చిన గోరువంకలు
.
కులుకులు నేర్చిన గోరువంకలే
కుమ్మరించెను వన్నెలచిన్నెలు
.
వన్నెలచిన్నెల చిట్టి చిలుకలే
రాతిరి వెలిగెడి అత్తరు దివ్వెలు
.
అత్తరు దివ్వెలు దోసిట పట్టిన కాంతి కన్యలే
మన ముంగిట నిలిచిన సంక్రాంతి కన్యలు

స్వాగతించండి మరి.....

# ఎద చప్పుడు

యెద చప్పుడు చేయనిదాన
నా యెద సవ్వడి వినిపించేనా...

నయనాలున్న నేమే జాణ
నా ప్రియసఖి నీకగుపించేనా...

నడకలు నేర్వని ఓ చినదాన
నా చెలినడకకు మతిపోయేనా...

హొయలొలికే నీ పరువపు వన్నె
సరిరాదు నాసఖి కాటుక కన్నులకన్నా...

నా చెలి సొగసునిగని చింతించకుమా
అమరావతి నగర అపురూప శిల్పమా...

# ఓ చినదాన

నడువొంపున కడపెట్టి...శిగకొప్పులో పూలుపెట్టి...

కానరాని కోకను చుట్టి......జారుకోక బిర్రుగ కట్టి...

ముంగాళ్ళకు మువ్వలెట్టి...కనుసన్నలొ కత్తులెట్టి...

సందెపొద్దుల కన్నుగొట్టి...పసిమనసును బెదరగొట్టి

నా గుండెను గుప్పిటబట్టి...వడివడిగా పరుగుపెట్టే...

..........ఓ చినదాన...
నామది దోచినదాన…

# శిశిరపు రాతిరి

శిశిరపు నాటి రాతిరిలపుడు
చిగురులు మొగ్గలు వేసేదెపుడు
మొగ్గలు పూలుగ పూసేదెపుడు
పూవుపై తుమ్మెద వాలేదెపుడు
తుమ్మెదతుమ్మెద కలిసేదెపుడు
ఎపుడు ఇంకెపుడు...
అని అడిగెను నాయెద చప్పుడు...

# అమృతపు చుక్కలు

చుక్కలమ్మ... చుక్కలు...
చీకటమ్మ బుగ్గమీది చక్కనైన చుక్కలు
రాతిరమ్మ రవికమీద తళుకులీనె చుక్కలు
వెన్నెలమ్మ వొడిలోన వాలగవొచ్చిన చుక్కలు
నిండు పున్నమి రేతిరిలో ఆడపిల్లలు ఆ చుక్కలు
మా మామను పెళ్ళాడ విల్లువిరవనొచ్చిన చుక్కలు
నిశి రాతిరి సమయాన నాట్యమాడే ఈ చుక్కలు
కార్తీక దీపమొదిలి నువు చూసిన చుక్కలు
నది ఆవల నావలో నే చూసిన చుక్కలు
తెల్లవారుజామున తుర్రుమన్న చుక్కలు
పల్లెలోన కురిసేటి కళ్ళాపి చుక్కలు
ఏడాదికి ఒకసారి నువ్వేసే ముగ్గులో
నీ చేతి వేళ్ళు గీసే చిత్రమైన చుక్కలు
నీ నుదిటి పైన జారే చందనపు చుక్కలు
నీ ఎదల నొంపులో తడియారని చుక్కలు
నీ నడుము వొంపులో చిక్కుకున్న చుక్కలు
మందారపు పూవులలో మకరందపు చుక్కలు
చిన్నిచిన్ని చుక్కలు.. ముద్దుముద్దు చుక్కలు
ముచ్చటైన చీకటి లో ముత్యమంటి చుక్కలు
నా చేతి పాళి మొనల అమృతపు చుక్కలు

# సొగసు చూడు

పచ్చగడ్డి... పైరగాలి... ఏటిగట్టు... రావిచెట్టు...
పల్లె చూడు... పడుచు చూడు... దాని సొగసు చూడు...
పచ్చగడ్డి నునుపుచూడు... పిల్లదాని నడుముచూడు...
పైర గాలి స్పర్శ చూడు... ఒక్కసారి తాకిచూడు...
ఏటిమీద సూరీడి సింధూరపు సొగసుచూడు...
రావిచెట్టు నీడలోన కిన్నెరసాని తొంగిచూడు...
కోనేటి కలువ మరి స్నానమాడి వచ్చెచూడు...
తడియారని కురులు చూడు... సిగకొప్పులో మల్లెలుసూడు ...
కాలికిగట్టిన గజ్జెలు చూడు...వెండిమువ్వల సవ్వడిజూడు...
నడకలోన కులుకు చూడు... హంస నడక నడిచె చూడు...
బిర్రుగ కట్టిన పవిట చూడు...పచ్చ రంగు రవిక చూడు...
ఉరిమి చూసే చూపు చూడు...పిల్లదాని పొగరు చూడు...

# విహంగమా

చిన్నిచిన్ని అడుగులు ఎన్నని వేయను వెచ్చని ఒడిలోకెపుడని చేరను
చిట్టిపొట్టి మాటల పాపను నేను ఓ చక్కని కోరిక చెబుతా విను

విహంగమా ఓ విహంగమా నను నీవలె మార్చుమా
విను వీధిలో విహరిద్దాం విశ్వపుటంచుకు ఉరకలు వేద్దాం
గగనము జగనమునేకం చేద్దాం నింగిన చుక్కలు నేలకి తెద్దాం
జాబిలమ్మకు జోల పాడుదాం వెండి వెన్నెలనే దోచేద్దాం
చిరుజల్లులు కురిపిద్దాం హరివిల్లుని రప్పిద్దాం
ఆకాశానికి రంగులద్దుద్దాం మేఘమాలికలో ఊయలూగుదాం
మరి బ్రహ్మనే మెప్పిద్దాం మరుజన్మకు నిలిచిఉందాం

# చుట్టినావు న్యాయమా!

నిశి రాతిరి సమయాన నడయాడిన మయూరమా
రవినిదురెడి తరుణాన ఉదయించిన వయ్యారమా
చిరు జల్లులో పరవశించి వికసించిన సోయగమా
హరివిల్లును భువికి దించి చుట్టినావు న్యాయమా
చెలి కాలుకదిపి నాట్యమాడ సొగసుచూడతరమా
చూచి మరువగలమా

# సిరాచుక్కలు

మనసు పెట్టి నేనొలికించే ప్రతి సిరా చుక్కలో...
అక్షరాలు మాత్రమే నావి... కానీ అందం...
చూసే కనులది...
చదివే మనసుది…

# Review

Hope you've enjoyed my writings...
Thanks for your time and patience...
Please leave a review so that others will get to know of this…
Happy Reading...
Have a nice day...
~Shiva~